గుంతల రహిత ఏపీ అంటే ఇదేనా..?

- కనీస మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మామిడికుదురు: రహదారులను పక్కాగా తీర్చిదిద్దుతున్నాం. సంక్రాంతి నాటికి గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం అంటూ అధినేతలు ఎంతో హడావుడి చేశారు. పండగకు వచ్చే ఏ వ్యక్తి రోడ్ల వల్ల ఇబ్బందులు పడకూడదని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. కానీ అతని మాటలకు, అధికారుల చేతలకు ఎక్కడా పొంతన లేదు. ఉన్న రోడ్లను తవ్వి వదిలేశారు తప్ప వాటికి కనీస మరమ్మతులు కూడా లేవంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడికుదురు మండలంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. రోడ్లపై ప్రయాణం చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో పాశర్లపూడి ఏటిగట్టు దిగువ నుంచి పెదపట్నంలంక వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎన్నికలకు ముందు ఏ విధంగా ఉందో ప్రస్తుతం కూడా అదే విధంగా ఉంది. అప్పటికి ఇప్పటికీ ఒకటే తేడా గుంతలు పడిన చోట జేసీబీతో రోడ్డును తవ్వేసి అదే మెటల్‌తో గుంతలు పూడ్చారు. దీంతో పాటు మట్టిని కూడా గోతుల్లో వేసి గుంతలు పూడ్చేసిన స్థాయిలో గొప్పలు పోతున్నారు.



పెదపట్నంలంక ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి ఇది



తవ్వి వదిలేసిన ఆదుర్రు ఆర్అండ్‌బీ రోడ్డు

మూడు నెలల క్రితం తవ్వేశారు..

ఆదుర్రు నుంచి మోరిపాలెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును మూడు నెలల క్రితం మరమ్మతుల పేరుతో తవ్వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రోడ్డుపై మెటల్ తవ్వేయడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆదుర్రు జక్కంపూడి వారి గ్రూపు నుంచి మోరిపాలెం వరకు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉంది. కానీ దీన్ని పట్టించుకునే నాథుడు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉందని, నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. నిధులు ఎప్పుడు విడుదల అవుతాయి, రోడ్లు ఎప్పటికి అభివృద్ధికి నోచుకుంటాయని ప్రజల నుంచి నిట్టూర్పులు వినిపిస్తున్నాయి.

ప్రయాణం చేయాలంటే భయమేస్తోంది



అప్పనపల్లి నుంచి బి.దొడ్డవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రోడ్డును ఎక్కడికక్కడ తవ్వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీస మరమ్మతులు చేసినా ఇబ్బంది ఉండేది కాదు. కానీ దీని సంగతి ఎవరూ పట్టించుకోవడం లేదు. మోటార్ సైకిల్‌పై వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. మా గ్రామం రావాలంటేనే ఆటో డ్రైవర్లు బాబోయ్ అంటున్నారు. పరిస్థితి అంత దారుణంగా ఉంది.

– పసుమర్తి నానాజీ, బి.దొడ్డవరం

రోడ్డు తవ్వేసి మూడు నెలలైంది



ఎంతో హడావుడిగా రోడ్డును తవ్వేశారు. రోడ్డు తవ్వేస్తుంటే రోడ్డు అభివృద్ధి పనులు చేస్తారనుకున్నాం. కానీ ఆ ముచ్చట మూడు రోజులుగానే మిగిలిపోయింది. రోడ్డు తవ్వేసి మూడు నెలలు దాటినా ఇంత వరకు రోడ్డు అభివృద్ధి మాట దేవుడెరుగు కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. తవ్వేసిన రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలి.

– నాగాబత్తుల శ్రీకృష్ణ, ఆదుర్రు

గుంతల రోడ్లే కనిపిస్తున్నాయి



గుంతలు లేని రోడ్డు ఎక్కడ కనిపించడం లేదు. హడావుడి చేసి కొన్ని పనులు చేశారు. తప్ప ప్రధాన రోడ్ల సంగతి పట్టించుకోలేదు. అభివృద్ధి అంటే గుంతలేనా. గత ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు కదా మరి మీ ప్రభుత్వం చేస్తున్న దేమిటి. కూటమిని నమ్మి ప్రతి గ్రామంలోను భారీ మెజార్టీ ఇచ్చారు. కానీ దాని తాలూకు అభివృద్ధి మాత్రం ఎక్కడా జరగడం లేదు. ఇప్పటికైనా కూటమి నేతలు స్పందించాలి. రోడ్లను అభివృద్ధి చేయాలి.

– భూపతి సురేష్‌కుమార్, ఆదుర్రు

క్లుప్తంగా

ఉపాధి పనులపై పారదర్శకంగా ఆడిట్

మామిడికుదురు: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులపై సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్సార్పీ కనకారావు తెలిపారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహణపై కో–ఆర్డినేటర్ సమావేశం జరిగింది. ఏపీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ సోషల్ ఆడిట్ గురువారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఈ ఆడిట్ జరుగుతుందని చెప్పారు. 2023–24లో మండల పరిధిలో ఉపాధి హామీ ద్వారా రూ.5.50 కోట్లు విలువైన 882 పనులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పనులపై గ్రామాల వారీగా బృందాలు సోషల్ ఆడిట్ నిర్వహిస్తాయని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నయినాల సీతామహలక్ష్మి, జేఈ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బౌద్ధ స్తూపాలను అభివృద్ధి చేయాలి



ఆదుర్రు బౌద్ధ స్తూపం వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న బౌద్ధ భిక్షువు భోధిహీన్

మామిడికుదురు: రాష్ట్రంలో ప్రధాన బౌద్ధ స్తూపాలు 40 వరకు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం అభివృద్ధి చేయాలని శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు భోధిహీన్ కోరారు. ఆయన బుధవారం ఆదుర్రులోని ప్రాచీన ఆది బౌద్ధ స్తూపాన్ని సందర్శించారు. బౌద్ధ స్తూపం చుట్టూ తిరిగి ప్రార్థనలు చేశారు. ఆదుర్రు ఆది బౌద్ధ స్తూపం గొప్పదనాన్ని బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి బౌద్ధ భిక్షువు బోధిహీన్‌కు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అమరావతిని రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధి చేస్తుందో అదే తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ బౌద్ధ స్తూపాలను కూడా తీర్చిదిద్దాలన్నారు. బౌద్ధ స్తూపాల వద్ద ప్రతి పౌర్ణమికి దీపోత్సవం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ భిక్షులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆయన వెంట రాంబాబు, స్థానికులు ఉన్నారు.

హైందవ ధర్మంపై విషం కక్కుతున్న కాంగ్రెస్

సఖినేటిపల్లి: హైందవ ధర్మంపై కాంగ్రెస్ పార్టీ నాటి నుంచి నేటి వరకూ విషం కక్కుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. బుధవారం అంతర్వేదిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కుంభమేళా పురస్కరించుకుని గోదావరిలో మునిగితే ఆకలి తీరుతుందా అంటూ కాంగ్రెస్ నాయకత్వం విమర్శ చేయడం ఎంత వరకూ సబబని అన్నారు. తొలుత అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, కన్వీనర్ అడబాల రాంబాబు, నాయకులు మేడిచర్ల చాణక్య, కాపిశెట్టి కనకేశ్వరరావు, యెనుముల సుబ్బారావు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసిన ఘటనపై ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొల్లాటి రాంబాబు, సీతలకు, అదే గ్రామానికి చెందిన పినపోతు రవికుమార్, కుటుంబ సభ్యులు మధ్య పాత గొడవలు ఉన్నాయన్నారు. వీటిని పురస్కరించుకుని దారికి అడ్డంగా రాంబాబు తన బైక్‌ను పెట్టాడని, సదరు బైక్‌ను తీయమని రవికుమార్ అడగ్గా ఇరు వర్గాల మధ్య వైరం పెరిగి కర్రలతో కొట్టుకున్నారన్నారు. రాజోలు ప్రభుత్వాస్పత్రిలో వారంతా చికిత్స పొందుతున్నట్టు, దీనిపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు.

వీఆర్ఏల నూతన కార్యవర్గం

రాజోలు: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ మండల సమావేశం బుధవారం రాజోలు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో జరిగింది. వీఆర్ఏల సమస్యలను పరిష్కారం చేయాలని నినాదాలు చేశారు. ముఖ్యఅతిథి దారపురెడ్డి వీరభద్రం ఆధ్వర్యంలో వీఆర్ఏల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చాగంటి రాజకుమార్, కార్యదర్శి కడలి దుర్గా శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దొంగ కనకదుర్గ, కోశాధికారిగా సోమని రాధ, ఉపాధ్యక్షురాలిగా అమలదాసు లక్ష్మీ దుర్గ ఎన్నికయ్యారు.

కొబ్బరికాయల లోడు పంపుతామని మోసం

పి.గన్నవరం: కొబ్బరికాయల లోడు పంపిస్తామని నమ్మించి వ్యాపారి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.45 వేలు కాజేసిన సంఘటనపై పి.గన్నవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజులపాలెం శివారు అయినాలవారిపాలేనికి చెందిన గుత్తుల వెంకటేశ్వరరావు కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నాడు. ఆయనకు గత అక్టోబర్ 16న ఓ వ్యక్తి ఫోన్ చేసి వ్యాన్‌లో కొబ్బరిలోడు పంపిస్తున్నానని నమ్మబలికాడు. ఆ మాటలు నమ్మిన వ్యాపారి గూగుల్‌పే ద్వారా అతనికి రూ.45 వేలు పంపాడు. అప్పటి నుంచి ఆ వ్యక్తి ఆచూకీ తెలియక బుధవారం వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేశారు.

వేడుకగా విగ్రహాల ప్రతిష్ఠ



బి.దొడ్డవరంలో పాలతో విగ్రహాల సంప్రోక్షణ

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో ప్రజల విరాళాలతో నూతనంగా నిర్మించిన ఉమా సోమేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. శిథిలస్థితికి చేరిన ఆలయాన్ని సమూలంగా తొలగించి దాని స్థానే ప్రజా విరాళాలు సుమారు రూ.కోటితో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈదరాడకు చెందిన శైవాగమ పండితులు పూజ్యం జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పార్వతీదేవి, సోమేశ్వరస్వామి పానపట్ట లింగం, రెండు వృషభాలు, నూతన ధ్వజస్తంభం, బలిపీఠం, పార్వతి ఆలయ శిఖరాలు, సువర్ణయంత్ర పునః ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్ఠా మహోత్సవాల్లో కంభంపాటి సుబ్రహ్మణ్యశ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకట రామనాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా నూతన విగ్రహాలను పాలతో సంప్రోక్షణ చేశారు. యాగశాల ప్రవేశం, కలశ స్థాపన తదితర పూజలను వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు.

నూతన ఫీడర్ల ప్రారంభం



సఖినేటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన ఫీడర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి, అంతర్వేది విద్యుత్ సబ్‌స్టేషన్లలో బుధవారం నూతన 11 కేవీ ఫీడర్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆ శాఖ ఎస్ఈ రాజబాబుతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండల పరిధిలో రానున్న వేసవిలో వోల్టేజీ సమస్యలు లేకుండా చేసేందుకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ఫీడర్ల వల్ల విద్యుత్ వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కాగా నియోజకవర్గంలో సుమారు రూ.40 కోట్ల విలువతో సదరు శాఖాపరమైన పనులు జరిపినట్టు ఆయన అన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, కొండా జాన్‌బాబు, నాయకులు గుబ్బల శ్రీనివాస్, రావి ధర్మరాజు, అయినవిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలోని లక్కవరంలో బుధవారం 8 ఎంవీఏ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో సుమారు రూ.8 కోట్ల విలువైన పనులను ప్రారంభించామన్నారు. అంతేకాక రూ.40 కోట్ల మేర విద్యుత్ సంబంధిత పనులు కూడా చేపట్టామన్నారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, మంగెన నాని, సర్పంచ్ కోట పుష్పకుమారి, గంటా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



కొత్తపేటలో హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు, సీఐ విద్యాసాగర్

కొత్తపేట: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణాలు కాపాడుకోవడంతో పాటు కుటుంబ రక్షణగా నిలవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా నియమాలు, పోలీసు శాఖ పిలుపు మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో బుధవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వాడపాలెంలో ర్యాలీని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి ఆయనతో పాటు సర్కిల్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో స్థానిక మారుతీ సెంటర్, కౌశిక రోడ్డు, బస్టాండ్ సెంటర్, మెయిన్‌రోడ్డు గుండా దేవీ సెంటర్ వరకూ బైక్ ర్యాలీ సాగింది. సీఐ విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం చేయకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ సభ్యుడు విళ్ల మారుతీప్రసాద్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, స్థానిక ఎస్సై సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్నద్ధం చేయాలి



ఈదరాడ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న డీఈఓ సలీంబాషా

మామిడికుదురు: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. ఆయన బుధవారం నగరం, ఈదరాడ, మగటపల్లి, కరవాక జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. నగరం, ఈదరాడ, మగటపల్లి ప్రాథమిక పాఠశాలలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్ఏఎంపీ–3 పరీక్ష పేపర్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. ఒక లక్ష్యం ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఏకాగ్రతతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్బోధించారు. ఆయన వెంట ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: పదకొండు ఏళ్ల నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కిశోరీ బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో ఆరోగ్య పరంగాను, రక్షణ పరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు మేరకు కిశోరీ వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రాజెక్టు కొత్తపేట సీడీపీఓ ఎ.గజలక్ష్మి అధ్యక్షతన జరిగిన 'కిశోరీ వికాసం' శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ, గోపాలపురం, ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 11–18 సంవత్సరాల బాల బాలికలకు, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నైపుణ్య ఉపాధి, ఆత్మరక్షణ, లింగ వివక్షత, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, స్కూల్ టీచర్లు, కళాశాల లెక్చరర్లు, సచివాలయ సిబ్బంది, సురక్ష స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పి.గన్నవరం: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచులు, మరిదిపై పి.గన్నవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊడిమూడి గ్రామానికి చెందిన సీహెచ్ సౌజన్య విశాఖపట్నంలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు 2023 మార్చి 24న అయినవిల్లి మండలం ఎరుకల్లంకకు చెందిన పాము రాజకుమార్ అలియాస్ వరప్రసాద్‌తో తొత్తరమూడిలో వివాహం జరిగింది. వివాహ సమయంలో అబ్బాయికి రూ.4.5 లక్షల కట్నం, ఆడపడుచు లాంఛనాలు, బైక్ ఇచ్చినట్టు వివరించారు. అనంతరం అదనపు కట్నం కోసం భర్తతో పాటు, అత్త, ఇద్దరు ఆడపడుచులు, మరిది కలసి సౌజన్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, దీంతో నాలుగైదు సార్లు పెద్దల సమక్షంలో తగవు పెట్టినా ఫలితం లేదన్నారు. అత్తింటి వారి వేధింపులు ఆగకపోవడంతో సౌజన్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ వివరించారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తాం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులతో ఆయా శాఖల పురోగతి, గ్రామాల్లో సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి రాత్రి, తెల్లవారుజామున పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం టాయ్‌లెట్స్, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు గైర్హాజరు కావడాన్ని, ఆయా శాఖల సమస్యలపై సరైన సమాధానం లేకపోవడాన్ని, పంటల బీమా, తాగునీటి సమస్యను పలువురు సభ్యులు ప్రస్తావించారు. అనంతరం ఆత్రేయపురం మండల పరిషత్ 2025–26 సంవత్సరం అన్ని పద్దుల ఆదాయం రూ.81,26,56,384, అన్ని పద్దుల వ్యయం రూ.81,26,20,668గా చూపి, రూ.35,716 మిగులుతో అంచనా బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగార్రాజు, ఎంపీడీవో బీకేఎస్ఎస్‌వీ రామన్, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో బంగారు పతకం



బంగారు పతకం పొందిన హంట్ ఫర్ ఫుడ్ చిత్రం

రాజోలు: ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో పొదలాడకు చెందిన కాకర రవితేజ బంగారు పతకం సాధించారు. ఈ నెల 27, 28 తేదీల్లో కేశనపల్లిలో ఫొటో వర్క్‌షాప్ జరిగింది. సుమారు 40 మంది ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొన్నారు. శంకరగుప్తం మేజర్ డ్రైన్‌లో చేపల వేటను చిత్రీకరణ చేసిన రవితేజ ఫొటోకు (హంట్ ఫర్ ఫుడ్) బంగారు పతకం లభించింది. అలాగే మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన మీర్ జవాద్ అలీ తీసిన ప్రకృతి సోయగం చిత్రానికి వెండి పతకం లభించింది. సఖినేటిపల్లి మండలం గొందికి చెందిన ఫొటోగ్రాఫర్ బుంగా ఎనోష్ ఫొటోకు సిల్వర్ మెడల్ దక్కింది. విజేతలను పలువురు అభినందించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకోవాలి



మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

కొత్తపేట: రైతులు పాడి పశు సంపదను కాపాడుకోవాలని వానపల్లి వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ (వీఎల్ఓ) జి.ప్రసాదరావు సూచించారు. ఉచిత పశు వైద్య శిబిరాల్లో భాగంగా బుధవారం వాడపాలెంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ నాగా లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, ఏహెచ్ఏలు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు: ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాట్రేనిపాడు సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కాట్రేనిపాడులో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పొన్నమండ పశు వైద్యాధికారి బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. 60 పశువులను పరీక్షించి మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వీఎల్ఓ విజయశేఖర్, గోపాలమిత్రలు, ఏహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

అలమూరు: పాడి పరిశ్రమ అభ్యున్నతికి, పశువుల మెరుగైన ఆరోగ్యానికి పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలమూరు ఏడీఏ ఎల్.అనిత అన్నారు. మండలంలోని చెముడులంక పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ప్రారంభించారు. అనంతరం పాడి రైతులకు ఆయన ఉచితంగా మందులు అందజేశారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



అంబాజీపేటలో మోహన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు నిత్యం సేవలందించే అధికారుల పనితీరుకు తగిన గుర్తింపునిస్తాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రకాంత్ అన్నారు. ఈ నెల 26న ఉత్తమ సేవా పురస్కార్ అవార్డును అందుకున్న విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ కాకర మోహన్‌ను అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలందించి, వారికి అందుబాటులో ఉండాలన్నారు.

మాజీ సర్పంచ్ గోవిందరాజు మృతి



అలమూరు: మండలంలోని పినపళ్లకు చెందిన గ్రామ మాజీ సర్పంచ్ అన్నందేవుల గోవిందరాజు (90) మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన వయోభారం దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో బుధవారం తెల్లవారుజామున ఆయన నివాసంలోనే మృతి చెందారు. గ్రామ సర్పంచ్ గా సుదీర్ఘకాలం 15యేళ్ళ పాటు పనిచేసి గ్రామాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఆయన భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. నలుగురు కుమార్తెలు ఉన్నారు. మాజీ సర్పంచ్ మృతికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు తమ సంతాపాన్ని తెలిపారు.

రహదారుల నిర్మాణానికి చర్యలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో శివారు కాలనీలకు రహదారుల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పి.మంగాదేవి అన్నారు. నందంపూడిలో అనిశెట్టివారిపాలెం, విప్పర్తివారిపాలెంలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజను బుధవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ రెండు పాలేల్లో 15వ ఆర్థిక సంఘ నిధులతో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పి.వీరాస్వామి, ఉప సర్పంచ్ నేదునూరి మురళీకృష్ణ, మంద వెంకటేశ్వరరావు, కేతా అర్జునరావు, బెండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం కృష్ణారెడ్డికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకున్న కృష్ణారెడ్డి

రావులపాలెం: మండలంలోని ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేఎస్‌వీ కృష్ణారెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించినట్టు బుధవారం ఆయన తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ సంస్థ కృష్ణారెడ్డి విద్యాశాఖకు అందించిన అత్యుత్తమ సేవలకు గాను గౌరవ డాక్టరేట్‌తో పాటు భారత్ సేవా రత్న నేషనల్ అవార్డు 2025 అందించిందన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఇటీవల హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మనం ట్రస్ట్ అధినేత కె. చక్రవర్తి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, తెలంగాణలో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి కవి, రచయిత, ఎలమంచిలి వెంకటరమణ, డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు కృష్ణారెడ్డికి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి పురస్కారాన్ని అందజేసినట్టు తెలిపారు.

టాటా ఏస్, స్విఫ్ట్ కారు ఢీ

అంబాజీపేట: మొసలపల్లి శివారు ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో టాటా ఏస్, స్విఫ్ట్ కారులు ఢీ కొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురం నుంచి ముక్కామల వైపు వెళుతున్న టాటా ఏస్ గృహోపకర వస్తువులతో వెళుతుంది. ముక్కామల నుంచి అమలాపురం వైపు వెళుతున్న స్విఫ్ట్ కారు మొసలపల్లి వచ్చేసరికి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వాహనాల్లో ఉన్న వారికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాలేదు.